క్లుప్తంగా

కోటి సంతకాల సేకరణ



పెబ్బేరు రూరల్: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు బీసీ సామాజిక కులగణన, రిజర్వేషన్ల పెంపు కోసం శ్రీరంగాపురం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మండల బీఎస్పీ ఆధ్వర్యంలో గురువారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి ఘనపురం కృష్ణ, జిల్లా కార్యదర్శి బహుజన రమేష్, ఎంపీటీసీ ఎల్లస్వామి, జిల్లా కోకన్వీనర్ గుడిసె ధర్మ, నాయకులు భాస్కర్, బీసన్న, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

రజక భవనం ఏర్పాటు చేయండి



మదనాపురం: మండల కేంద్రంలో రజక భవనం ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం మండల రజక సంఘం ఆధ్వర్యంలో ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ కృష్ణయ్యయాదవ్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొన్నూరు తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం



పెబ్బేరు రూరల్: క్రీడలు మానసికోల్లాసంతో పాటు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని సింగిల్ విండో చైర్మన్ జగన్నాథంనాయుడు అన్నారు. గురువారం శ్రీరంగాపురం మండల కేంద్రంలోని రంగనాథస్వామి జాతర సందర్భంగా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్‌పీఎల్–10 ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను క్రీడాకారులతో కలిసి ప్రారంభించారు.

ప్రారంభమైన హోలీ



ఖిల్లాఘనపురం: మండలంలోని పలుగ్రామాల్లో హోలీపండుగ సంబురాలు ప్రారంభమయ్యాయి. పండుగ ముందు వారం రోజుల పాటు గ్రామాల్లో ఆడపిల్లలు కావయ్య ఆట, మగపిల్లలు ఎలుగుబంటి ఆటలు ఆడటం ఆనవాయితీ. గురువారం రాత్రి మండలంలోని అప్పారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో చిన్నారులు ఈ ఎలుగుబంటి ఆట ఆడుతూ కనిపించారు. చిన్నారులంతా పోగై ఒకరికి ఎలుగుబంటి వేషధారణ చేశారు. ఈ నెల 7న హోలీ పండుగ వరకు ఈ ఆటలు ఆడుతామని చిన్నారులు చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెబ్బేరు: పట్టణ కేంద్రంలో శుక్రవారం విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని సబ్ ఇంజినీర్ అభిలాష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు వెడల్పు పనులు జరుగుతున్నందున విద్యుత్ లైన్లు మార్చడం కోసం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని, పట్టణ ప్రజలు, దుకాణదారులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



ఆత్మకూర్‌లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి



శ్రీరంగాపురం కేజీబీవీలో..



వీపనగండ్లలోని కస్తూర్బా విద్యార్థులకు సూచనలిస్తున్న వైద్యాధికారి వంశీకృష్ణ

ఆత్మకూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ వసతి గృహంలో చదువుకుంటున్న విద్యార్థులకు తిప్పుడంపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ శరత్ ఆధ్వర్యంలో దగ్గు, జ్వరం, తలనొప్పి, చర్మవ్యాధులు ఉన్న వారిని గుర్తించి మందులు అందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని వసతి గృహాలను ప్రతి గురువారం సందర్శించి విద్యార్థులకు వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డెన్ ఆనంద్, హెల్త్ సూపర్‌వైజర్లు ఆయూబ్‌ఖాన్, సురేందర్‌గౌడ్, ఏఎన్ఎం రాజమణి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

వీపనగండ్ల: విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించినప్పుడే విద్యలో ఉత్తమంగా రాణించగలుగుతారని మండల వైద్యాధికారి డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల బాలికలకు ఆరోగ్య సమస్యలు, సలహాలు అనే కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. బాలికలు మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉండాలని, చిన్న పాటి సమస్యలు వచ్చినా వైద్యాధికారుల సూచనలు తీసుకోవాలని ఆయన అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఎన్నో సమస్యలను అధిగమించవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఓ స్వప్న, పలువురు ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో 174 మంది విద్యార్థులకు మండల వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య అధికారి రాముడు వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 34 మంది విద్యార్థులు వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతుండడంతో వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్య అధికారి మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. వడదెబ్బ సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు శ్రీదేవి, ఆశాకార్యకర్తలు భాగ్యమ్మ, కల్పన, జ్యోతి, జానకి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించేందుకే 'ప్రేరణ'



వనపర్తిలో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్



కల్వరాలలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కతలప్ప

వనపర్తి టౌన్: విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో 10జీపీఏ సాధిస్తే అదే వారు గురువులకు ఇచ్చే గురుదక్షిణ అని, దానికి మించిన ఆనందం ఉపాధ్యాయులకు మరొకటి ఉండదని ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. చదువు చెప్పిన ఉపాధ్యాయులు విద్యార్థుల నుంచి ఏం ఆశించరని, కేవలం విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకున్నప్పుడు సంతోషిస్తారు. గురువారం జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ప్రేరణ తరగతులు ఎంఈఓ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయురాలు తారాబాయి, తెలుగు విషయ నిపుణులు ఎద్దుల యాదగిరి, హిందీ రజాక్ మియ్యా, ఇంగ్లిష్ శంకర్‌నాయక్, ఫిజికల్ సైన్స్ శ్రీనివాసులు, సోషల్ గోపాలకృష్ణ, గణితం పుల్యానాయక్ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించినట్లు తెలిపారు.

వీపనగండ్ల: పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్న వేళ విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించేందుకు ప్రత్యేక ప్రేరణా తరగతులు నిర్వహించి వారిలో ధైర్యాన్ని నింపాలని ఎంపీడీఓ కతలప్ప, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. గురువారం కల్వరాల ఉన్నత పాఠశాల ఆవరణలో మండలంలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న 68 మంది పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. విద్యార్థులు సమయం వృథా చేసుకోకుండా కష్టపడి చదుకోవాలని, ప్రతి అంశాన్ని నెమరు వేసుకోవాలని సూచించారు. తక్కువ సమయంలో ఎక్కువ గుర్తుంచుకొని ప్రథమ స్థాయిలో ఉత్తీర్ణులై పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలని కోరా రు. హెచ్‌ఎంలు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, సుజాత, భానుచందర్, గోపాల్‌నాయక్, కేశవులు, శ్రీధర్‌రెడ్డి, వెంకటేశ్ పాల్గొన్నారు.

ట్యాంక్ ఓవర్ ఫ్లో.. కళాశాలలోకి తాగునీరు



తరగతి గదిలోకి చేరిన నీరు

వనపర్తి టౌన్: రామన్‌పాడు నుంచి తాగునీటిని పంపింగ్ ద్వారా వాటర్ ట్యాంక్‌లోకి ఎక్కించే క్రమంలో లైన్‌మెన్ల పర్యవేక్షణ కొరవడటంతో ట్యాంక్ నుంచి ఓవర్ ఫ్లో అయిన నీరు గురువారం జిల్లా కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణం, తరగతి గదిలోకి వరదలా రావడంతో అధ్యాపకులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాటర్ ట్యాంక్‌లోకి తాగునీరు ఎక్కించే పైప్‌లు పెద్దవి కావడంతో ట్యాంక్ నిండిన వెంటనే వాల్ బంద్ చేయకపోవడం, ట్యాంక్ వద్ద పబ్లిక్ హెల్త్ కార్యాలయ నిర్మాణం జరుగుతుండటంతో ఓవర్ ఫ్లో అయిన నీరు డ్రెయినేజీ గుండా బయటికి వెళ్లేందుకు కంకర, మట్టి అడ్డుగా ఉండటంతో పక్కనే ఉన్న కళాశాలలోకి చేరాయి. దీంతో కార్యాలయంలోని ఫైల్స్, ఇతర సామగ్రి దెబ్బతినకుండా అధ్యాపకులు జాగ్రత్తపడ్డారు. ఈ సంఘటనకు సంబంధించి ఫొటోలు, వీడియోలను కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్ సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో ఆగమేఘాల మీద స్పందించిన మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, కమిషనర్ విక్రమసింహారెడ్డి, ఎంఈ భాస్కర్ తదితరులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. డ్రెయినేజీకి మట్టి, కంకర అడ్డు ఉండడంతో పాటు లైన్‌మెన్ల నిర్లక్ష్యం కారణంగానే నీరు కళాశాలలోకి వచ్చిందని గుర్తించారు. ప్రతిసారి కళాశాలలోకి తాగునీరు ఇలాగే వస్తుందని, శాశ్వత పరిష్కారం చూపాలని మున్సిపల్ అధికారులను, చైర్మన్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ అభ్యర్థించారు. ఈ మేరకు చర్యలు చేపడతామని వారు హామీ ఇచ్చారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ చేయాలి

పెబ్బేరు: మెడికో విద్యార్థి ప్రీతి మరణంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సిట్టింగ్ జడ్జిచే విచారణ చేపట్టి దోషులకు శిక్షించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గిరిజన విద్యార్థిని ఉన్నత చదువులకు నోచుకోని పరిస్థితి ఈ రాష్ట్రంలో ఉందని, కాలేజీలు, యూనివర్సిటీల్లో ఇలాంటి సంఘటనలు జరగకుండా ఆడ పిల్లలకు భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

మూతబడిన అంగన్‌వాడీ కేంద్రాలు

వీపనగండ్ల: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఆందోళన చేస్తుండడంతో రెండు రోజులుగా అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడ్డాయి. మొదటి రోజు పెబ్బేరు ప్రాజెక్టు సీడీపీఓ కార్యాలయం ఎదుట శాంతియుతంగా నిరసన తెలియజేసిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు.. గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట తమ నిరసనను తెలియజేసేందుకు వెళ్లారు. దీంతో రెండు రోజులుగా మండలంలోని 30 అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడి దర్శనమిస్తున్నాయి. పనికి తగ్గ వేతనాన్ని చెల్లించాలని, హెల్త్ కార్డులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరుతూ గతంలో కూడా అంగన్‌వాడీ టీచర్లు హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిరసనను తెలియజేశారు.

అందరికీ కంటి పరీక్షలు

ఆత్మకూర్: పట్టణంలోని ఏడో వార్డులో గురువారం కంటి వెలుగు శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: మండలంలోని చింతకుంట, కేతేపల్లి, రాయినిపల్లి గ్రామాలల్లో గురువారం నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమంలో 504 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి పేర్కొన్నారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని అల్లమాయపల్లి, ఉప్పరిపల్లిలో కంటి వెలుగు శిబిరాలను గురువారం నిర్వహించారు. మండలంలో మొత్తం 404 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ సౌజన్యలత చడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రాంచందర్ రెడ్డి, మక్బుల్ పాష, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తప్పవు



అక్రమంగా నిర్మించిన మెట్లను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

అమరచింత: మున్సిపాలిటీ అనుమతులకు విరుద్ధంగా అక్రమంగా ఇంటి నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజా హెచ్చరించారు. పట్టణంలోని శ్రీకృష్ణనగర్‌లో కాళికా ఆలయం సమీపంలో నారాయణ అనే వ్యక్తి కొత్తగా ఇంటి నిర్మాణ పనులు చేస్తూ రహదారిపై మెట్లను నిర్మిస్తున్నాడనే ఫిర్యాదుతో టౌన్ ప్లానర్ సుధాకర్‌తో కలిసి ఇంటి నిర్మాణ పనులను పర్యవేక్షించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేస్తుండటంతో మెట్లను మున్సిపల్ సిబ్బంది ద్వారా తొలగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో కొత్తగా ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించే వ్యక్తులు మున్సిపల్ నుంచి అన్ని అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. రహదారిని ఆక్రమించుకోవడం, డ్రెయినేజీలపై నిర్మాణాలు చేపట్టరాదన్నారు. పట్టణంలో సీసీ రహదారుల నిర్మాణాలకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మంగ లావణ్య పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు



కొత్తకోట చౌరస్తాలో సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

కొత్తకోట: త్రిపుర, నాగాలాండ్ రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో భారతీయ జనతా పార్టీ విజయం సాధించడంతో పాటు మేఘాలయలో గతంలో కంటే ఎక్కువ సీట్లు సాధించడంతో గురువారం రాత్రి బీజేపీ శ్రేణులు కొత్తకోట చౌరస్తాలో టపాసులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నాయకులు మాట్లాడుతూ దేశంలో నరేంద్రమోదీ ప్రధానిగా చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఎప్పుడు, ఎక్కడ ఎన్నికలు జరిగినా ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు.

అమరచింత: ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీ విజయం సాధించడంతో పట్టణంలో గురువారం బీజేపీ నాయకులు గురువారం సంబరాలను నిర్వహించారు. మోదీ చేస్తున్న అభివృద్ధి పథకాలతోనే దేశవ్యాప్తంగా బీజేపీ బ్రహ్మరథం పడుతున్నారని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజు అన్నారు. అనంతరం టపాసులు కాల్చుతూ మిఠాయిలను పంచి పెట్టారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, క్యామ భాస్కర్, అశోక్, మేర్వ అనిల్, జగన్నాథం, సిద్ధురాములు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం



దంతనూరులో పర్యటిస్తున్న మధుసూదన్‌రెడ్డి

మదనాపురం: కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పేదలందరికీ వంట గ్యాస్ సిలిండర్‌ను రూ.500 లకే అందజేస్తామని మహబూబ్‌నగర్ డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. గురువారం మండలంలోని దంతనూర్‌లో హాత్ సే హాత్ జోడో యాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, సామాన్య ప్రజల శ్రేయస్సు కోసం పనిచేసే ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పేద, సామాన్యులందరికీ ఇందిరమ్మ ఇళ్ల పేరుతో రూ.5లక్షల సాయం అందిస్తామని వెల్లడించారు. రాబోయే ఎన్నికల్లో ప్రజల నడ్డి విరుస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కొండ ప్రశాంత్‌రెడ్డి, టీపీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు పల్లెపాగు ప్రశాంత్, టీపీసీసీ మైనార్టీ ప్రధాన కార్యదర్శి సాధిక్, వనపర్తి జిల్లా కాంగ్రెస్ ఫిషర్మెన్ అధ్యక్షుడు యాదన్న తదితరులు పాల్గొన్నారు.

చిన్నంబావి: రానున్న ఎన్నికల్లో రాష్ట్రం, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీని అందరూ ఆదరించి ప్రజా ప్రభుత్వ ఏర్పాటులో భాగస్వామ్యం కావాలని హాత్ సే హాత్ భారత్ జోడో కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి అభిలాష్‌రావు కోరారు. ఆయన గురువారం మండలంలోని చెల్లపాడులో పర్యటించారు. కాంగ్రెస్ నాయకులతో కలిసి గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి రాహుల్ గాంధీ సందేశాన్ని ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు తాగు, సాగునీరు లేక పంట పొలాలు ఎండి పోతుంటే ఎమ్మెల్యే బీరం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. మాదాసి కురువలను ఎస్సీ జాబితాలో, వాల్మీకీలను ఎస్టీ జాబితాలో చేర్చుతామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సోషల్ మీడియా సెక్రెటరీ పరమేశ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీలత రెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కంటి శివన్న, జిల్లా సేవాదల్ జనరల్ సెక్రెటరీ రఫీయోద్దీన్, వీపనగండ్ల మండల అధ్యక్షుడు బీరయ్య యాదవ్, పెద్దకొత్తపల్లి మండల అధ్యక్షుడు తగిలి కృష్ణయ్య, సంకటి మద్దిలేటి, బాలకృష్ణ, భీముడు, నరసింహ, హుస్సేన్, అలిపిరి కాశన్న పాల్గొన్నారు.

పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తాం



వివరాలు సేకరిస్తున్న డిప్యూటీ సీఈఓ రామహేశ్వర్‌రెడ్డి

పాన్‌గల్: అంగన్‌వాడీ టీచర్ల సస్పెండ్‌పై పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని డిప్యూటీ సీఈఓ, ఇన్‌చార్జ్ డీడబ్ల్యూఓ రామహేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని 1, 3వ అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన సందర్శించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల మండల పర్యటనలో కలెక్టర్ అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించిన సమయంలో ఇద్దరు అంగన్‌వాడీ టీచర్లు విధులకు గైర్హాజరు కావడంతో కలెక్టర్ వారిని సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. దీనిపై కలెక్టర్ నివేదిక ఇవ్వాలని ఆదేశించడంతో వివరాలు సేకరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కలెక్టర్ మండల పర్యటనకు వచ్చిన సమయంలో 1వ అంగన్‌వాడీ కేంద్రం టీచర్ ఇందిరమ్మ పెబ్బేర్ కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రం పనిపై వెళ్లిందనే విషయాన్ని అమె రాతపూర్వకంగా అందజేయడంతో దాని ఆధారంగానే వివరాలను సేకరిస్తున్నామని, 3వ అంగన్‌వాడీ కేంద్రం టీచర్ తిరుపతమ్మ ఎందుకు గైర్హాజరు అయిందనే విషయంపై ఆమె ఇచ్చిన వివరణ ఆధారంగా వివరాలు సేకరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ లక్ష్మమ్మ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పెంచిన ధరలు తగ్గించే వరకు పోరాటం



ఆత్మకూర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కేతేపల్లిలో సీపీఐ ఆధ్వర్యంలో..



అమరచింతలో..

అమరచింత: నిత్యావసర సరుకులతో పాటు వంట గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలను చీటికి మాటికి పెంచడమే కేంద్ర ప్రభుత్వ వైఖరిగా మారిందని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ అన్నారు. వంటగ్యాస్ ధరల పెంపుపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం మరికల్, ఆత్మకూర్ ప్రధాన రహదారిపై ఖాళీ సిలిండర్లతో రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పీఎం నరేంద్రమోదీ పేదల సంక్షేమాన్ని గాలికి వదిలి ప్రజావాస్తులను అమ్మడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సింధు, లక్ష్మి, రాజ్‌కుమార్, కోఆప్షన్లు షాహిన్, షానవాజ్ ఖాన్, అడ్వకేట్ రాజేందర్, మార్కెట్ చైర్మన్ రాజు, జెడ్పీటీసీ మార్క సరోజ, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు రమేష్ ముదిరాజ్, అక్కల నరసింహులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: వంట గ్యాస్ సిలిండర్ ధర పెంపును నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని కేతేపల్లిలో కట్టెల పొయ్యి, ఖాళీ సిలిండర్‌తో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్ మాట్లాడుతూ 2014 సంవత్సరం వరకు గ్యాస్ సిలిండర్ ధర రూ.410 ఉండగా.. తొమ్మిదేళ్ల బీజేపీ పాలనలో రూ.1153కు చేరిందన్నారు. నాగాలాండ్, మేఘాలయ, త్రిపుర రాష్ట్రాల్లో ఎన్నికలు ముగియగానే రూ. 50 పెంచి పేదలను మోసం చేశారన్నారు. కార్యక్రమంలో కుర్మయ్య, పెంటయ్య, హన్మంతు, చిన్నకుర్మయ్య, చంద్రయ్య, రాముడు, నర్సింహ, ఎల్లయ్య, చెన్నమ్మ, శంకరమ్మ, నరసమ్మ, లక్ష్మీదేవమ్మ పాల్గొన్నారు.

వీపనగండ్లలో..

వీపనగండ్ల: కేంద్ర ప్రభుత్వం సిలిండర్ ధరలను పెంచడాన్ని నిరసిస్తూ గురువారం గోవర్ధనగిరిలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రోడ్లపై సిలిండర్లను ఉంచి ధర్నా చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ వచ్చే నెల 5న దేశ రాజధాని ఢిల్లీలో లక్షలాది మందితో నిరసన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మదుగం శ్రీను, బిచ్చన్న, కృష్ణయ్య, గణేశ్, బాలచంద్రుడు, చాందుపాష, హనుమంతు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్‌లో..

ఆత్మకూర్: కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ ధరలను పెంచుతూ సామన్యుల నడ్డివిరుస్తున్నదని మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు మండల పార్టీ అధ్యక్షుడు రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ శ్రీధర్‌గౌడ్, వైస్ ఎంపీపీ కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పాలన దినోత్సవం



పాన్‌గల్: మండలంలోని రేమద్దుల ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి స్వయం పాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. డీఈఓగా రుక్మిణి, డిప్యూటీ డీఈఓగా గాయిత్రి, ఎంఈఓగా శిరీష, హెచ్ఎంగా చంద్రకళతో పాటు 26 మంది ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, జీహెచ్ఎం లత, ఎస్ఎంసీ చైర్మన్ వసంతకుమార్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణాలను అందుబాటులోకి తేవాలి



గోపాల్‌పేట: గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణాలను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని, అంతేకాకుండా నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఓ నర్సింహులు సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన ఉమ్మడి మండలంలోని తాడిపర్తి, గోపాల్‌పేట, చాకల్‌పల్లి, బుద్దారం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా నర్సరీల్లో మొక్కల పెరుగుదలపై కూలీల నుంచి వివరాలు సేకరించారు. బుద్దారంలో కంటివెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ ఉసేనప్ప, ఏపీఓ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.